
ఇచ్ఛాపురపు రామచంద్రం



# వెండి అంచుల వెనుక

ఓవర్ బ్రిడ్జి ఎక్కుతున్నాడు కృష్ణమూర్తి.

చేతిలో సూట్ కేస్ బరువుగా ఉంది. ఎత్తు ఎక్కుతూంటే ఆయాసంగా ఉంది. హృదయం ఆత్రతతో కొట్టుకుంటూంది. రాధ వచ్చిందో, లేదో?

అడుగులు వేగం పెంచుకోబోతూంటే-భుజంమీద చెయ్యిపడింది.

"కృష్ణమూర్తీ!-"

చూశాడు.

"ఎవరు?"

"శ్రేయోభిలాషినే. భయపడకు. సార్థకనామధేయుడివనిపించుకుంటున్నావు. సాహసంచేస్తున్నావు. ఫరవాలేదు. నీ కలలు పండుతాయి. ఒక్కముక్క మనసులో పెట్టుకో. కలలోనయినా అమ్మాయికి అన్యాయం తలపెట్టకు. నీ జీవితం మూడు పువ్వులూ ఆరు కాయలూ అయితీరుతుంది. ఎన్ని ఆశలతో ఆమె నీవెంట వస్తూందో నీకు తెలుసు. అయినవారందరినీ వదిలి-నిన్నే నమ్ముకుని నీవెంట వస్తూందంటే నిన్నెంత ప్రేమించిందో గ్రహించు..."

కృష్ణమూర్తి నిలువెల్లా వణికిపోయాడు.

ఎవరితను? ఎవరికీ తెలియని తమ రహస్యాన్ని ఎలా కనుక్కోగలిగాడు?

చూడడానికి మామూలు మనిషిలా కనపడుతున్నాడు. కాని-మహానుభావుడే! త్రికాలజ్ఞుడిలా ఉన్నాడు.

"తమరెవరు?"

"వైనం దొరక్కుండా దూరతీరాలకు ఎగిరిపోతున్న నీకు-నా వైనం తెలుసుకుని లాభమేమిటి? నిన్నూ నీ ప్రయత్నాన్నీ ఆశీర్వదించమని దేముడిచే పంపబడ్డ దూతననుకో."

"కృష్ణా! అనాడు-కృష్ణుడు రాధకే అంకితం అయ్యాడు. ఇప్పుడు నువ్వు..." నవ్వాడతను.

చలించిపోయాడు కృష్ణమూర్తి.

ఎవరీ అద్భుత జ్యోతిష్కుడు? పేర్లతోసహా ఉన్నదున్నట్లు చెప్పేస్తున్నాడే!

"వాగ్దానం చేస్తున్నాను స్వామీ. జీవితాంతమూ రాధని వదలను".

"శుభం. నీ జీవితం చక్కగా సాగుతుంది. నీ కలలు పండుతాయి. అమ్మాయిని పదిలంగాకాపాడుకో. ఇవాళ నిన్ను ఏ మనుషులు తేలికచేస్తున్నారో, వాళ్లంతా రేపు నీకు నివాళిపడతారు. రెండు జీవితాల కలయిక అద్భుతాలకూ దారితీస్తుంది. అనర్థాలకీ దారితియ్యొచ్చు. అమ్మాయి జాతకం మంచిది. అదే నీకు శ్రీరామరక్ష..."

వెలుగునుంచి చీకటిలోకి మాయమైపోయాడతను. కృమూర్తి మళ్ళీ బ్రిడ్జి మీద నడవసాగాడు విస్మయంనుంచి తేరుకుని. ఇప్పుడతని మనసులో సందేహాలు లేవు. సంశయాలులేవు. భవిష్యత్తు బంగారుమయంగా కనిపిస్తూంది.

త్వరత్వరగా ప్లాట్‌ఫారం చేరుకున్నాడు.

అక్కడ-రాధ ఎదురుచూస్తూంది.

అర్ధరాత్రి కావడాన ప్లాట్‌ఫారం ప్రశాంతంగా ఉంది.

చక్కని నిద్రను-దుస్వప్నాలు భంగపరిచేటట్లు ఉండుండి రైలుకూతలు.

గార్డు విజిలువేశాడు.

రాధా, కృష్ణమూర్తి కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు.

* * *

మామూలు మనుషుల పరిభాషలో-రాధా కృష్ణమూర్తీ లేచిపోతున్నారు! ఔను, సాంఘిక పరిధులలో జీవితాన్ని యిముడ్చుకోలేక-ఎక్కడో ఏదో లభిస్తుందన్న ఆశతో-రెక్కలు విదిలించుకుని విహంగాల్లా ఎగిరిపోతున్నారు వాళ్లు!

నిజానికి వాళ్ళిద్దరిదీ నేరంచేసే తత్వం కానేకాదు.

సాహసాలు చెయ్యగలిగే మనుషులు కానే కాదు. కాని-వ్యవస్థ వాళ్లచేత యిటువంటి పని చేయించింది. రాధ-కృష్ణమూర్తి తనని ప్రేమించాడన్న భ్రమలోఉంది. కృష్ణమూర్తి-రాధ తనని ఆరాధిస్తూందన్న కలలలో ఉన్నాడు.

నిజంమాత్రం వేరు. వాళ్ళిద్దరూ జీవితాన్ని వెర్రిగా ప్రేమిస్తున్నారు. జీవితాన్ని అందుకుందుకు ఆసరా వెదుక్కుంటున్న సమయంలో ఒకరికొకరు తారసపడ్డారు. ఎదుటివారికి తమలోని వెండి అంచులను చూపుతూ ఒకరినొకరు ఆకర్షించుకున్నారు. ఈ ఆకర్షణ వెనుక చాలా అసత్యం పొంచిఉంది - వాళ్ల అంతరంగాల అడుగు పొరలలోకి చూడగలిగితే.

రాధా! నువ్వు మాకు నిజంచెప్పవూ? ఆత్మవంచన చేసుకోకుండా అసలు విషయం బయటపెట్టవూ? ప్లీజ్...

* * *

అమ్మా నాన్నలకి నాలుగో అమ్మాయిని నేను. మా నాన్న మధ్యతరగతి కుటుంబీకుడు గుమాస్తా పనిచేసి రిటైరయిపోయాడు. మూడోఅక్క పెళ్ళితే మా ఆర్థికపరిస్థితి చితికి ముక్కలైంది. నాన్న పెన్షనుతో మేము ముగ్గురం ఓ పూట తినడమే కష్టం. పరువుమాట మరచిపోతే-అడుక్కుతినవలసిన స్థితి. కాని-పస్తులుంటాము కానీ, పరువువదలం అనే మధ్యతరగతి మనిషి మా నాన్న. నేను అందంగానే ఉంటాను. కొంచెం పాటకూడా వచ్చు. పదిహేనేళ్లు వచ్చేవరకూ నాటకాల్లో వేసేదాన్ని సరదాగా. నాన్నకి ఆ విషయాలు తెలియనిచ్చేదాన్నికాను

నా అందంచూసీ, గాత్రంచూసీ ఏ పెళ్ళికొడుకో నన్ను వలచి వరించి వరకట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటాడని భ్రమ. కలలలో మునిగే నాన్నకి వాస్తవాన్ని ఆకళింపుచేసుకోగలిగేశక్తి నశించిపోయింది. వృద్ధుల బుద్ధులు సంచలింపవే అని భారతంలో చెప్పనే చెప్పారు. ఏతావతు-నేను తేల్చుకున్నదేమిటంటే - ఆ పరిస్థితులనుబట్టి నాకు సంప్రదాయసిద్ధమైన పద్ధతిలో వివాహం జరిగేమార్గం లేదు. నేను నచ్చి - కట్నంనచ్చక ఎన్ని సంబంధాలు బుసిగిపోయాయో చూశాకనే నేనా నిర్ణయానికి వచ్చాను.

నా జీవితాని కొకేమార్గం ఉంది. అది నాటకాలు వేసుకుని పొట్టపోసుకోవడం. ఆ యింట్లో ఉండగా నన్నాపని చెయ్యనివ్వరు. పరువు ప్రతిష్ఠలు అడ్డుపడతాయి. అర్ధాకలితో జీవించడం నాకిష్టం లేదు. నా మనస్సు అందమైన జీవితం కోసం, అనుభూతులకోసం, అనుభవాల కోసం ఆరాటపడుతూంది. దాన్ని అరికట్టడానికి ప్రయత్నించి ప్రయత్నించి ఓడిపోయాను.

ఇరవైరెండేళ్ల మనిషిని. కడుపు నిండా అన్నం తినాలనుకోడం నేరమా? మగవాడితో జీవితం పంచుకోవాలనుకోడం అపరాధమా? ఇవి-కనీసకోర్కెలు కావూ నావంటి ఆడపిల్లకి? వీటినుంచి నన్ను వంచించడం న్యాయమా?

అస్తవ్యస్తంగా మనసు అటూ యిటూ

పరుగులుతీసే సమయంలో కృష్ణమూర్తి తారసిల్లాడు. అతను నా క్లాస్‌మేట్. చిన్నప్పుడు ఇద్దరమూ నాటకాల్లో వేశాం. అతను నన్ను చూసిన తీరులో-ఆశ రగిలింది. ఊత దొరుకుతుందని ప్రయత్నించాను. వాలుచూపులతో, వలపుమాటలతో – వలలు పన్నాను. అందీ అందకుండా ఆకర్షణ రేపాను. నాకు కావలసింది ఒకటే. జీవితంలో కాలూనేవరకూ కాస్త ఆసరా. అది మగవాడే యివ్వగలడు. కృష్ణమూర్తి చాలావిధాల నమ్మకస్తుడు. అందుకే అతన్ని ఆశ్రయించాను.

ఇప్పుడయితే నా పక్కన కూర్చున్నాడు కానీ-జీవితాంతమూ యిలాగే నాతో ఉంటాడని గుడ్డిగా నమ్మేసేందుకు నేను అమాయకురాలిని కాను. తుమ్మెదని నమ్మే పూవునికాను. కాని - కృష్ణమూర్తి బొత్తిగా దుర్మార్గుడుకాదని నాకు తెలుసు. అతనిలో కొంచెం జాలిఉంది. నా బ్రతుకు నేను బ్రతకగలిగేవరకూ అతను నన్ను వదిలిపోడు అది - నా విశ్వాసం. ఆ విశ్వాసంతోనే యిల్లువదిలి వస్తున్నాను. నా ఎన్నిక నన్ను పూర్తిగా మోసంచెయ్యదు. నాకు జీవితంకావాలి. ఆ జీవితం పొడవెంతో నాకవసరంలేదు. కాకి బతుకుకంటె హంస జీవితం నా కిష్టం. ఆ కూపంనుంచి నన్ను బయటకు లాగడానికి ఓఆసరా అవసరం. అందుకు కృష్ణమూర్తి ని ఉపయోగించుకుంటున్నాను.

లేచివచ్చిన ఆడపిల్లల కథలతాలూకు ముగింపు నాకు తెలియకకాదు. బొత్తిగా నిరాశల గుహల్లో ఊపిరాడకుండా తీసుకు తీసుకు చావడంకంటె - ప్రయత్నించి విఫలమైనా-కొంత తృప్తి. అదీ నా తత్వం.

జీవితాన్ని పణంపెట్టి భవిష్యత్తులోకి పరుగుతీస్తున్నాను. ఈ పందెంలో పాల్గొనడం చాలు. గెలుపు ఓటమిలతో ఆట్టే ప్రయత్నంలేదు. అందుచేత-నేను మీ జాలినీ, సానుభూతినీ కోరుకోవడం లేదు. అనవసరంగా వృధాపర్చకండి వాటిని.


నేనే జాలిపడుతున్నాను - నావంటి అమ్మాయిలు నాలాగ సాహసించలేక మధ్యతరగతి మురికికూపాలలో వ్యవస్థ పాదాలకింద నానా అవస్థలూ పడుతున్నందుకు. ఇంతే నా కథ. దీని ముగింపు కోసం మీరు తల బద్దలుకొట్టుకోకండి. వెళ్లండి—

* * *

కృష్ణమూర్తీ, కృష్ణమూర్తీ-నీ సంగతేమిటి? చెప్పవూ?

చెప్తాను. దాచుకోవలసిన కథేమీకాదు. ఈ సమాజంలో నాలాటి కృష్ణమూర్తులు మీ కెందరయినా కనిపిస్తారు హృదయంతో చూస్తే.

నేనూ మధ్యతరగతి కుటుంబంలో వాడినే. రాధలాగే నాకూ చదువబ్బలేదు. నాటకాలబ్బాయి. నేను చదివిన కొంచెం




చదువుకి గుమాస్తాపని దొరకలేదు-ఎంత ప్రయత్నించినా. నాకుతెలుసు. నా వంటి వాడికి ఉద్యోగం దొరికేరోజులు కావివి. పైగా-యింట్లో పెళ్ళి చేసేస్తామని పోరు పెడుతున్నారు. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా-అంటూ నసపెడుతున్నారు. ఈ రోజుల్లో ఎంత టికానా లేనివాడయినా మగకుర్రాడంటే చాలు వెయ్యో రెండువేలో పలుకుతున్నాడు కద? అదీ మా వాళ్లకి నామీద ఇంట్రెస్టు. చెట్టంత ఎదిగి - ప్రయోజకుణ్ని కాలేక వాళ్లమీద ఆధారపడుతున్నందుకు సిగ్గుపడుతున్నాను. నా కాళ్లమీద నేనునిలబడగలగాలి. అందుకు విశ్వ ప్రయత్నం చేయసాగాను. కనపడేదొకే ఒక్క మార్గం. నాటకాలు! నాటకాల నిచ్చెన లెక్కి - సినిమాస్వర్గం అందుకుంటే జీవితం ఓ దారిపడుతుంది. ఐతే - అందుకు రాధలాటి అందగత్తె ఆసరా అవసరం. రాధ ముఖంచూసి ఆమెకు ఎక్స్ట్రావేషాలైనా యివ్వకపోరు. ఆ సినీవ్యూహంలోకి రాధని ప్రవేశింపజెయ్యడం సులభం. తరువాత ఆమె చేయూతతో నేనూ అడుగుపెట్టగలనని నా నమ్మకం. బ్రతకాలి. అంతే. మీరు నన్ను పౌరుషహీనుడని అసహ్యించుకున్నా సరే. నాకు జీవితంకావాలి. జీవితాన్నందుకుందుకు ఏ తోవయినా తొక్కుతాను. నా కథ గొప్పగా ఉండాలని నేనేమీ కోరుకోను. ఏదోవిధంగా నేను నా కాళ్లమీద నిలుచోగలగాలి. అంతే. కడుపునిండిన వాళ్లకేతప్ప పరువు పౌరుషంవంటి మాటలు నాలాటి వాళ్లకి కాదు.

రాధని లేవదీసుకుపోతున్నాను. ఆమె నన్యాయం చేయడానికి కాదు. ఇద్దరి బ్రతుకులూ బాగుచేసుకుందామనే. ఇది మీకు నీచంగా తోస్తే - నేనేంచెయ్యను? నిరుద్యోగిగా - ఒకరికి భారంగా కొన్నాళ్లుండి ఉంటే నా ఆవేదన మీకూ అర్థమౌతుంది.

నా భవిష్యత్తేమిటని ఆలోచించకండి. అది అర్థంలేని ప్రశ్న. ఇవాళ గడిస్తే తప్ప రేపు రాదు. రేపేం జరుగుతుందో

యివాళే తెలుసుకోగలిగితే - జీవితాలు యిలాగ ఉండవు.

ఆ జ్యోతిష్కుడి మాటలు...తాత్కాలికంగా ఆనందపరిచాయి. అంతే, ప్రయత్నిస్తాను. నేను కోరుకునే కనీసపు జీవితాన్ని అందుకోగలిగేందుకు శలవ్.

* * *

జ్యోతిష్కుడూ, జ్యోతిష్కుడూ - నువ్వెవరు? నీ తమాషా కథేమిటి? నిజంగా నువ్వు త్రికాలజ్ఞుడివేనా? ఓసారి నిజం చెప్పవూ? నీ రహస్యం ఎవరికీ చెప్పంలే.

నవ్వేశా డతను.

త్రికాలజ్ఞుడినే ఐతే నాకీ కర్మెందుకూ? రాధ వ్రాస్తున్న ఉత్తరం ముందే నా కంట పడింది. ఆ ఉత్తరం సహాయంతో కృష్ణమూర్తి గురించీ వాళ్ల లేచిపోవడం గురించీ కొన్ని గంటలముందు తెలుసుకున్నాను. నేనుఎలాగూ పెళ్ళిచెయ్యలేను నా భ్రమలూ ఆశలూ ఏనాడో నేలమట్టం అయిపోయాయి నా అసమర్థతని కప్పిపుచ్చుకుందుకు ఏవో మాయమాటలు చెప్పేవాడిని నలుగురికీ అమాయకపు రాధ అవి నిజమనుకుంది.

నేను చేయలేని పెళ్ళి రాధ తనంతట తానేచేసుకోబోతోంది. అందుకుసంతోషమే వేసింది రేపు నలుగురి ముందూ తలదించుకుంటానంటే_అదో నాటకం. మధ్యతరగతి మనిషి పరువు ప్రతిష్టలు కాపాడుకోక తప్పదు కదా? ఈ వేషం వేసింది కూడా అందుకే కద?

రాధ ప్రయత్నం సఫలం అవ్వాలనీ ఆమె కృష్ణమూర్తితో కలకాలం సుఖంగా జీవించాలనీ నా కోరిక. ఇంకేం చెయ్యడానికీ సమర్థత లేకపోయినా - కృష్ణమూర్తితో ఒ మాట అనడానికి ప్రయత్నించాను. దానికి సత్ఫలితం ఉండాలనే నా ఆకాంక్ష.

నేనెవరో తెలిసిందికదూ? రాధ తండ్రిని. మధ్యతరగతి మనిషిని.

* * *

ఇదేమిటి?

ఈ కథ యిలాగ అయిందేం?

వెండి అంచుల కథ వ్రాయబోతే-వెండి అంచుల వెనక వెక్కిరించే వ్యవస్థ తాలూకు కథ ఐపోయిందెందుకనీ?

ఏమో!

నిజంగా నాకూ తెలియదు.

